రిసెప్షన్ సెంటర్ల వద్ద పక్కా ఏర్పాట్లు

-నాణ్యమైన భోజనాన్ని అందజేయాలి - పటిష్టంగా స్ట్రాంగ్ రూమ్‌లను రూపొందించాలి
జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి
లెండి, జెఎన్టియు కళాశాలలను పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర-విజయనగరం/డెంకాడ: రిసెప్షన్ సెంటర్లవద్ద అన్ని వసతులను కల్పిస్తూ, పక్కాగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఆమె ఆదివారం ఉదయం జెఎన్‌టియు గురజాడ విశ్వవిద్యాలయం, డెంకాడ మండలంలోని లెండి ఇంజనీరింగ్ కళాశాలలను సందర్శించారు. వాహనాల పార్కింగ్ కోసం పరిసర ప్రాంతాలను సైతం పరిశీలించారు. రిసెప్షన్ సెంటర్లు, స్ట్రాంగురూములు, బారికేడింగ్, పార్కింగ్, భోజన ఏర్పాట్లు పై సమీక్షించారు. లెండి కళాశాలలో రాజాం, చీపురుపల్లి, గజపతినగరం, నెల్లిమర్ల, శృంగవరపుకోట నియోజకవర్గాలు, జెఎన్‌టియు జివిలో బొబ్బిలి, విజయనగరం నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జరుగుతుందని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రిసెప్షన్ సెంటర్ సిబ్బందితోపాటు, పోలింగ్ అనంతరం ఇవిఎంలను తీసుకువచ్చే అధికారులు, సిబ్బంది రాకపోకలకు ఎక్కడా ఇబ్బంది పడకుండా కౌంటర్లను ఏర్పాటుచేయాలని సూచించారు. కౌంటర్లు తగినంత విశాలంగా, పూర్తి లైటింగ్‌తో ఏర్పాటు చేయాలన్నారు. ఇవిఎంలను తీసుకొని రావడానికి, స్ట్రాంగురూములోకి తరలించడానికి, అవసరమైన పత్రాలను నింపేందుకు, అందజేసేందుకు వీలుగా కౌంటర్లు ఉండాలన్నారు. బస్సులు, అధికారుల వాహనాలు లోపలికి రావడానికి, సిబ్బందిని దించి బయటకు వెళ్లడానికి వీలుగా రెండు వేర్వేరు మార్గాలను ఏర్పాటు చేయాలని, ఎక్కడా ట్రాఫిక్ జామ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రాల్లో స్పెషల్ కౌంటర్లు, ఆర్‌ఓ టేబుల్, హెల్ప్ డెస్క్, స్క్రూటినీ, మైక్రో అబ్జర్వర్స్ కోసం కూడా కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. అధికారులకు, సిబ్బందికి వేసవిని దృష్టిలో పెట్టుకొని, అందుకు తగ్గట్టుగా భోజన సదుపాయాన్ని కల్పించాలని ఆదేశించారు. భోజనం నాణ్యతగా, రుచికరంగా ఉండేలా చూడాలని, సరిపడినంత సరఫరా చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. భోజనం కోసం ఎక్కడా రద్దీ ఏర్పడకుండా, తగినన్ని కౌంటర్లను ఏర్పాటుచేయడంతోపాటు, సరఫరా చేసేందుకు అవసరమైనంతమంది సిబ్బందిని కూడా నియమించాలని సూచించారు. సిబ్బంది ఇవిఎంలతో లోపలికి వచ్చిన దగ్గరనుంచి, తమకు కేటాయించబడ్డ కౌంటర్లకు సులువుగా చేరుకొనేవిధంగా, గుర్తించే విధంగా నేమ్ బోర్డులు, డైరెక్షన్ బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే మంచినీరు, మరుగుదొడ్ల సౌకర్యాన్ని ప్రతీచోటా కల్పించాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ఇవిఎంల స్ట్రాంగ్ రూములను సిద్దం చేయాలని, పనులు వెంటనే మొదలు పెట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్‌ఓ ఎస్‌డి అనిత, ఆర్‌డిఓ ఎంవి సూర్యకళ, ఆయా కేంద్రాల నోడల్ అధికారులైన మెప్మా పిడి ఎం.సుధాకరావు, హౌసింగ్ పిడి శ్రీనివాసరావు, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి సుధారాణి, డిప్యూటీ సిఇఓ కె.రాజ్ కుమార్, జెడ్‌పి సిఇఓ శ్రీధర్ రాజా, డిఎస్‌ఓ మధుసూదనరావు, సివిల్ సప్లయిస్ డిఎం మీనాకుమారి, పంచాయితీరాజ్, ఆర్ అండ్ బి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ అభివృద్ధి చేసిన వైసీపీ పభుత్వానికి మద్దతు పలకండి

వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శంబంగి విజ్ఞప్తి

విశాలాంధ్ర-బొబ్బిలి: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకి సంక్షేమ అభివృద్ధి పథకాలు అవినీతి రైతు పాలన అందించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలని వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శంబంగి వెంకట చిన అప్పలనాయుడు విజ్ఞప్తి చేశారు. ఆదివారం పురపాలక సంఘం పరిధిలో గల 20వ వార్డులో సార్వత్రిక ఎన్నికల ప్రచారం ఎమ్మెల్యే శంబంగి నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి వైసీపీ ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తూ ఇంట్లో ప్రతి ఒక్కరూ తమ రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుకు వేసి తనను విజయనగరం జిల్లా పార్లమెంట్ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ ని, తనను ఎమ్మెల్యే గా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వంలో పేదరికాన్నే కొలమానంగా తీసుకుని అర్హులైన లబ్దిదారులకు సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మో హన్ రెడ్డి కి దక్కు తుందన్నారు. రానున్న ఎన్నికలు పేదరిక నిర్మూలన, పెత్తందారీ వ్యవస్థల మధ్యన జరుగు తున్నాయని, ఎవరి పాలన మేలు చేస్తుందో ప్రజలు గుర్తించాలని అందుకు అనుగుణంగా ఓట్లు వేసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాల్ నాయుడు వైయస్సార్ కాంగ్రెసు పార్టీ యూత్ అధ్యక్షులు శంబంగి శ్రీకాంత్, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ తూముల అచ్యుతవల్లి, న్యాయవాది రూంకానా ప్రసాద్ జేసిఎస్ కన్వీనర్లు తమ్మి రెడ్డి దామోదర్ రేజేటి విశ్వేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్ ర్సన్ గొలగాని రమాదేవి, కౌన్సిల్ సభ్యులు మరిపి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి బెల్లాన ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-చీపురుపల్లి: పట్టణంలో వెలసిన ఉత్తరాంధ్ర కల్పవల్లి కోరిన కోర్కెలు తీర్చే శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని విజయనగరం పార్లమెంట్ సభ్యుడు బెల్లం చంద్రశేఖర్ ఆదివారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం బెల్లాన కుటుంబ సమేతంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మే 13న జరగనున్న అసెంబ్లీ పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించాలని ఆయన అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజయనగరం పార్లమెంటు స్థానానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సోమవారం తన నామినేషన్ పత్రాన్ని సమర్పించనున్నామని ఆయన తెలిపారు. తన నామినేషన్ కార్యక్రమానికి కార్యకర్తలు అభిమానులు పార్టీ నాయకులు తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మీసాల వరహాల నాయుడు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వలి రెడ్డి శ్రీనివాస నాయుడు. ఇప్పిలి అనంతం బెల్లాన వంశీకృష్ణ. సూరు కుమార్ సూరు కామేశ్వరరావు ఎస్ వి జి శ్రీనివాసరావు సోమిశెట్టి శ్రీనివాసరావు సన్యాసిరావు ముళ్ళు పైడిరాజు ఇప్పిలి గోవిందరావు పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చడంలో వాకర్స్ క్లబ్‌లు ముందంజ

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తాడ్డి ఆదినారాయణ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం స్థానిక కామాక్షి నగర్ మెయిన్ రోడ్డు లో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ చలివేంద్రాన్ని ముఖ్యఅతిథిగా హాజరైన వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 102 గవర్నర్ జామి నారాయణ స్వామి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలంతా అల్లాడుతున్న ఇటువంటి తరుణంలో ప్రజల దాహార్తిని తీర్చడంలో డిస్ట్రిక్ట్ 102 పరిధిలో వాకర్స్ క్లబ్బులు ముందంజలో ఉన్నాయని అన్నారు. మనం ఆరోగ్యంగా బాగుంటే సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుందని, సమాజానికి ఆదర్శవంతంగా సేవలందిస్తున్న వాకర్స్ క్లబ్బులు సేవలను కొనియాడారు. అనంతరం క్లబ్ అధ్యక్షుడు తాడ్డి ఆదినారాయణ,క్లబ్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఎ.ఎస్.ప్రకాశరావు మాష్టారు,క్లబ్ గౌరవ సలహాదారులు ఆరికతోట తిరుపతిరావు మాట్లాడుతూ ప్రజలంతా ఈ వేసవి తాపాన్ని తట్టుకునేందుకు మంచినీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు అధికంగా తీసుకోవాలని, ప్రతీ ఏటా క్లబ్ ఆధ్వర్యంలో సుమారు మూడు నెలలపాటు మజ్జిగ చలివేంద్రాన్ని క్లబ్ సభ్యుల సహాయ సహకారాలతో విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. మొదటిరోజు చలివేంద్రానికి దాతగా డిస్ట్రిక్ట్ 102 మాజీ గవర్నర్ ఎడ్ల గణేష్ హాజరైన ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ క్యాబినెట్ కార్యదర్శి,నోబుల్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఆర్.ఎస్.నాయుడు, వాకర్స్ ఉద్యమకారులు కర్రోతు సత్యం మాష్టారు,నాలుగెస్సల రాజు, త్యాడ చిరంజీవి రావు, తోషిని వాల్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఆదినారాయణ, క్లబ్ ఉపాధ్యక్షుడు వల్లూరి శ్రీనివాసరావు,క్లబ్ కార్యదర్శి ఐ.వి.ప్రసాదరావు,కోశాధికారి ఆర్.సి.హెచ్.అప్పలనాయుడు, జాలీ వాకర్ గోవింద్,సహా కార్యదర్శి యాగాటి నలమహారాజు తదితరులు భారీగా సభ్యులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

విశాలాంధ్ర-తెర్లాం: తెర్లాం శాఖ గ్రంథాలయం లో ఆదివారం చిన్నతనం నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని స్థానిక గ్రంథాలయ అధికారి సి హెచ్. కృష్ణమూర్తి అన్నారు. గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమం సందర్భంగా చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించడం అయింది. పిల్లల లో కథలు పుస్తకాలు, పురాణ ఇతిహాసాలు గ్రంథాలయంలో ముఖ్య అంశాలను చదివించడం జరిగింది. చిల్డ్రన్స్ క్లబ్ లో భాగంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించడం అయింది.

పరిశ్రమలని స్థాపించి యువతను భాగస్వాములును చేస్తాం

లోకం నాగ మాధవి

విశాలాంధ్ర-భోగాపురం: పరిశ్రమలను స్థాపించి స్థానిక యువతకి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, స్థానిక పరిశ్రమల్లో యువతను భాగస్వా ములును చేస్తామని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి అన్నారు. జన విజయ యాత్రలో భాగంగా మండలంలో ముంజేరు పంచాయతీలో నెల్లిమర్ల తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ కర్రోతు బంగారు రాజు తో కలసి మాధవి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పిట్ట పేట, సబ్బన్నపేట, గాబువాని పేట, రెల్లి పేట గ్రామాలలో ప్రతీ ఇంటికి తిరిగి వచ్చే ఎన్నికల్లో గాజు గ్లాసు కు ఓటువేసి ఎన్డీయే ప్రభుత్వానికి తమ మద్దతు తెలియజేయాలని, సంక్షేమంతో కూడిన అభివృద్ధిని ప్రతి ఒక్కరికి అందిస్తామన్నారు. టిడిపి ఇంచార్జి కర్రోతూ బంగారాజు మాట్లాడుతూమాధవి నాన్ లోకల్ అనే ఆరోపణలు స్థానిక ఎమ్మెల్యే బడికొండ అప్పలనాయుడు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇక్కడే పుట్టి ఇక్కడే చదువుకున్నమాధవి పక్కా లోకల్ అని అన్నారు. ఆమె గెలిస్తే నెల్లిమర్ల నియోజకవర్గమే కాకుండా మొత్తం విజయనగరం జిల్లా అభివృద్ధి అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ముంజేరు ఎంపీటీసీ పిడుగు సత్యం, భోగాపురం మండలం పార్టీ ప్రెసిడెంట్ వందనాల రమణ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జీడి, మామిడి తోటలు దగ్ధం

విశాలాంధ్ర-బాడంగి : మండలంలోని పాత విమానాశ్రయం రన్వే మల్లంపేట గ్రామ సమీపంలో ముగడ గ్రామానికి చెందినా మూడడ్ల భాస్కరరావు తోపాటు పలువురు కి చెందిన మామిడి జీడి నీలగిరి తోటలు ఆదివారం మధ్యాహ్నం అగ్నికి దగ్ధం అయ్యాయని మండల అగ్నిమాపక అధికారి రామునాయుడు తెలిపారు. ఈ అగ్ని ప్రమాదం వలన సుమారుగా రెండు లక్షల రూపాయలు ఆస్తి నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు.ప్రమాదం విషయం తెలుసుకుని వెంటనే చర్యలు తీసుకోవడంతో పెద్ద ఆస్తి నష్టం జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోనున్నారు.

భీమసింగి పాపం ఎవరిది..?

ప్రత్యామ్నాయ కర్మాగారంగా మారుస్తామంటున్న వైసీపీ
తిరిగి చక్కెర కర్మాగారం తెరుస్తామంటున్న టీడీపీ
తగ్గిన చెరుకు సాగు.. ప్రత్యామ్నాయ సాగులో రైతులు

విశాలాంధ్ర-జామి: విజయనగరం జిల్లాలోని 15మండలాలతోపాటు పక్కనే ఉన్న విశాఖ జిల్లాకు చెందిన 3మండలాలు కలిపి మొత్తం 18మండలాలు అంటే 543 గ్రామాలలో భీమసింగి చక్కెర కర్మాగారం పరిది ఉంది. ఆయా మండలాలనుంచి దాదాపు 4వేల ఎకరాల వరకు చెరుకు పంట సాగు జరిగేది. స్థానికంగా రైతుల కోసం ఏర్పడిన భీమసింగ సహకార చక్కెర కర్మాగారం మొదటిగా 1960లో రిజిస్టర్ కాబడింది. అనంతరం 1976-77 నుంచి క్రషింగ్ సీజన్ మొదలు పెట్టారు. ప్రారంభంనుంచి కర్మాగారం లాభదాయకంగానే నడిచింది. కానీ మధ్యలో పంచధార ధరలు తగ్గడంతోపాటు కేంద్ర రాష్ట్ర విదానాల కారణంగా కర్మాగారం నష్టాల భాట పట్టింది. అయినా ఎంత కష్టంలోనూ వేతనాలకు ఇబ్బంది లేకుండా నడిచేది. చివరకు అప్పులు పాలయ్యింది.

శిథిలయంత్రాలతోనే క్రషింగ్..

నేడు చక్కెర కర్మాగారాలు ఆధునికమైన విదానాలు, యాంత్రీకరణ నేపథ్యంలో క్రషింగ్ జరుపుకుంటున్నాయి. కానీ భీమసింగి కర్మాగారం మాత్రం నాటి యంత్రాలతోనే క్రషింగ్ చేసేవారు.ప్రధానంగా బాయిలర్ విభాగానికి ఏటా మరమ్మత్తుల కింద లక్షలాది రూపాయలను ఖర్చు చేసేవారు. ఇక క్రషింగ్ చేసే సమయంలో ట్యాంకులు ఇబ్బందులు కలిగి జ్యూస్ బైటకు పోయే పరిస్థితులు కూడా ఉన్నాయి. పనిచేసే ఉద్యోగులు, కార్మికులు ఎన్నో ఇబ్బం దులు పడేవారు. రక్షణ సౌక ర్యాలు సైతం అంతంత మాత్రమే. క్రషింగ్ రిక వరీ తగ్గడంతో క్రమంగా నష్టాలు మొదలయ్యాయి. ఈతరుణంలో 2003-04 సీజన్‌లో అనాటి తెలుగుదేశం ప్రభుత్వం హాయాంలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు కర్మాగారాన్ని మూసివేయించారు. అనంతరం వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి తెరిచింది. ఇక జగన్ ముఖ్యమంత్రి అయిన తరువాత భీమసింగిపై అధ్యాయనం చేసి మంత్రుల కమిటీ కర్మాగారాన్ని మూసివేయించింది. గత నాలుగేళ్ళగా భీమసింగి మూతపడింది.

ప్రత్యామ్నాయ పరిశ్రమ తప్పదా..!

ప్రస్తుతం భీమసింగి పరిదిలో చెరుకు సాగు పూర్తిగా తగ్గిపోయింది. ఉన్న చెరుకుతో క్రషింగ్ చేసే పరిస్థితి లేదు. దీనిని ముందుగానే కనిపెట్టిన వైసీపీ నేతలు ఈపరిశ్రమ స్థానంలో కొత్త పరిశ్రమను పెడతామని ప్రకటించారు. రానున్న ఎన్నికలలో గెలిచిన తరువాత ఈపరిశ్రమపై దృష్టి పెడతామని మంత్రి బొత్ససత్యనారాయణ ఇప్పటికే హామీ ఇచ్చారు. ఇక తాము అధికారంలోకి రాగానే భీమసింగి కర్మాగారాన్ని తెరుస్తామని తెలుగుదేశం పార్టీ నేతలు ప్రకటిస్తున్నారు. ఈనేపధ్యంలో అసలు భీమసింగి చక్కె కర్మాగారం ఉంటుందా.. లేక పూర్తిగా మూతపడుతుందా అనేది అందరిలో అనుమానం నెలకొంది.

కూటమి అభ్యర్థిని గెలిపించండి

బిజెపి జనరల్ సెక్రెటరీ పిన్నింటి వాసు

విశాలాంధ్ర-డెంకాడ: రాజకీయ రంగంలో కొత్త పొలిటికల్ గేమ్ చేంజర్ లోకం నాగ మాధవి. అతి తక్కువ కాలంలో ప్రజల్లోకి చొచ్చుకుపోయి సంచలనం సృష్టిస్తూ నెల్లిమర్ల నియోజకవర్గంలో ఉమ్మడి అభ్యర్థిగా దూసుకుపోతున్న లోకం నాగ మాధవి నీ అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బిజెపి జనరల్ సెక్రటరీ పిన్నింటి వాసు కోరారు ఈ సందర్భంగా నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థికి మహిళలు యువతరం బ్రహ్మ రథం పడుతున్నారు. లోకం మాధవిని గెలిపించడం ద్వారా నెల్లిమర్ల నియోజకవర్గంలో ఒక కొత్త మార్పు కి శ్రీకారం చుట్టాలని ప్రజలంతా ఏకమై ఎలక్షన్ రోజు కోసమే ఎదురు చూస్తున్నారు. భారతీయ జనతా పార్టీ కేంద్ర ప్రభుత్వం పూర్తిగా అండదండలు అందించి నెల్లిమర్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి పరిచే విధంగా ప్రణాళికలను తయారు చేస్తుంది త్వరలో ప్రచారంలోకి రాష్ట్రస్థాయి నాయకులను కూడా దిగబోతున్నారు. లోకం నాగ మాధవి ని అత్యధిక మెజార్టీతో గెలిపించే విధంగా భారతీయ జనతా పార్టీ కృషి చేస్తుందని తెలియజేస్తున్నాం

టీడీపీ జాతీయ అధినేత చంద్రబాబు చే బీఫాం అందుకున్న ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల..

విశాలాంధ్ర-శృంగవరపుకోట : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు చేతుల మీదుగా విశాఖ పార్లమెంట్ కూటమి అభ్యర్థి మతుకుమిల్లి శ్రీభరత్ తో పాటు శృంగవరపుకో నియోజకవర్గ ఉమ్మడి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలిత కుమారి బీఫామ్ అందుకున్నారు. అలాగే విశాఖ పార్లమెంటరీ పరిధి నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులు కూడా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా బీఫామ్ లు అందుకున్న వారిలో ఉన్నారు.

చంద్రబాబు చేతుల మీదుగా కళా వెంకటరావు కు బీ-ఫాం

విశాలాంధ్ర-విజయనగరం/చీపురుపల్లి: : విజయనగరం జిల్లా లో పోటీ చేసే టీడీపీ అభ్యర్థులకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు బి ఫారమ్ లు అందజేశారు. విజయనగరం పార్లమెంట్ స్థానానికి పోటీ చేసే కలిశెట్టి అప్పలనాయుడుతో పాటు నియోజక అసెంబ్లీ అభ్యర్థి అదితి గజపతిరాజు, చీపురుపల్లి అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు, రాజాం అభ్యర్థి కోండ్రు మురళి,గజపతినగరం అభ్యర్థి కొండపల్లి శ్రీనివాసరావులకు విజయవాడలో ని పార్టీ కేంద్ర కార్యాలయంలో చంద్రబాబు నాయుడు బి ఫారంలను అందించారు. తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు చీపురుపల్లి అసెంబ్లీ అభ్యర్థి కిమిడి కళా వెంకట్రావుతో పాటు జిల్లాలో గల ఇతర అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థులకు, విజయనగరం పార్లమెంట్ అభ్యర్థికి బీఫార్ములను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు కలిసేట అప్పలనాయుడు కొండ్రు మురళీమోహన్రావు. అతిథి గజపతిరాజు. కొండపల్లి శ్రీనివాస్. తదితరులు పాల్గొన్నారు.

23న చెల్లూరు వద్ద సిద్ధం సభను విజయవంతం చేయాలి

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పిలుపు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఈనెల 23వ తేదీన చెల్లూరు కూడలి వద్ద నిర్వహించనున్న సిద్ధం సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు, ప్రజలకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన బస్సు యాత్ర ఈనెల 23న చెల్లూరు కూడలి వద్దకు చేరుతుందని అన్నారు. అక్కడ సాయంత్రం నిర్వహించనున్న సిద్ధం సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారని తెలిపారు. సిద్ధం సభకు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. అధిక సంఖ్యలో ప్రజలను సమీకరించేందుకు పార్టీ శ్రేణులు నిమగ్నమయ్యాయని తెలిపారు. ప్రతి ప్రాంతంలో జరిగిన సిద్ధం సభలకు ప్రజలు తండోపతండాలుగా తరలి వెళుతున్నారని చెప్పారు. వైసిపి అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజలకు అందించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఆశీర్వదించేందుకు జనం నిరాజనం పలుకుతున్నారని చెప్పారు. నిన్నటి రోజున తాను విజయనగరం శాసనసభ నియోజకవర్గ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసినట్లు వెల్లడించారు. తదుపరి ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నట్లు చెప్పారు. 22 గ్రామాలు, 50 డివిజన్లలో బహిరంగ సభలు నిర్వహించేందుకు నిర్ణయించామన్నారు. ఆయా సభలలో ఐదేళ్లపాటు తాము ప్రజలకు అందించిన సంక్షేమ పాలన, నియోజకవర్గ అభివృద్ధి గురించి వివరించనున్నట్లు చెప్పారు. అభివృద్ధిని చూపి ఓట్లను అభ్యర్థిస్తున్నట్లు తెలిపారు. పట్టణ సుందరీకరణకు అధిక ప్రాధాన్యత నిచ్చామన్నారు. ప్రజల దాహార్తిని తీర్చగలిగామన్నారు.మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. వైసిపి ప్రభుత్వం ఏ విధంగా ప్రజలకు సహాయ సహకారాలు అందించి అండగా నిలిచిందో ప్రజలకు వివరించనున్నట్లు చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలో ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ కార్యక్రమాలను వివరించగలిగామన్నారు. ఎన్నికల నిమిత్తం ప్రజలను కలుసుకోవడం కొత్తగా ఏమీ లేదని అన్నారు.గత పాలకుల హయాంలో మంచినీటికి మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొనే వారని అన్నారు. ప్రస్తుతం తాము చేపట్టిన ప్రణాళిక బద్ధమైన విదానాలతో మహిళలకు నీటి సమస్య తీరిందన్నారు. తమ పాలనను ప్రజల ముంగిటకే తీసుకువెళ్లగలిగామని చెప్పారు. ఇటువంటి విషయాలను ఎన్నికల ప్రచారంలో ప్రజలు ముందు ఉంచేందుకు తమ కుటుంబ సభ్యులు కూడా పాలుపంచుకోనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల సమయంలో పార్టీ శ్రేణులకు ఉత్సాహం నింపడానికి అధినేత జగన్మోహన్ రెడ్డి చేపట్టిన బస్సు యాత్ర విజయవంతంగా సాగుతుందన్నారు. ఈ సమావేశంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయ యాదవ్, ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్, వైసిపి నగర అధ్యక్షుడు ఆసపు వేణు, సీనియర్ కార్పొరేటర్ కంటుభుక్త తవిటి రాజు, జోనల్ ఇన్చార్జులు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మాకు బాబు వద్దు ... జగన్‌నే సీఎం చేస్తాం...

రాజాం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్ కు హారతులు

విశాలాంధ్ర-రాజాం: సంతకవిటి మండలంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి డా. తలే. రాజేష్ శ్రీకాకుళం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్ మోహన్ రావు కు అడుగడుగున గ్రామ ప్రజలు మంగళ వాయిద్యాలు,హారతులు, పూలదండలతో ఘనస్వాగతం పలుకుతున్నారు.సంతకవిటి మండలం లిసురవరంలి గ్రామంలో ఇంటింటి ప్రచారం చేస్తు, ప్రతీ గడపకు వెళ్ళి ఈ ఐదు సంవత్సరాలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు. మే -13 %వ్ర% న జరగబోవు ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తు పై మి అమూల్యమైన ఓటు వేసి వైఎస్సార్సీపీ ఎంపీ అభ్యర్థి బెల్లాన.చంద్రశేఖర్ నీ, ఎమ్మెల్యే అభ్యర్థి అయిన డా. తలే. రాజేష్ అనే నన్ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తలే.భద్రయ్య,ఎంపీపీ సిరిపురపు.మంజుల,మండల పార్టీ అధ్యక్షులు గరుగుబిల్లి.స్వామి నాయుడు,, జేసిఎస్ మండల కన్వీనర్ రాగోలు.రమేష్ నాయుడు, యూత్ పార్టీ అధ్యక్షులు వావిలపల్లి.రమణ , వ్యవసాయ మండలి అధ్యక్షులు రాజు,వైస్ ఎంపీపీ పందు. రాజగోపాల్ నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ గుంద్రెటి.కేశరి, గంటా.షణ్ముఖ రావు, పెద్ది.గోవింద రావు,ఆయా గ్రామాల సర్పంచ్ లు, ఎంపిటిసిలు నాయకులు, యువకులు, మహిళలు, మండల పరిధిలో గల సర్పంచులు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న ప్రజా ప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, బూత్ స్థాయి కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి అంటేనే సంక్షేమం, అభివృద్ధికి చిరునామా

బడుకొండ ప్రదీప్ నాయుడు

విశాలాంధ్ర-భోగాపురం: వైసిపి అంటేనే సంక్షేమం, అభివృద్ధికి చిరునామా అని నెల్లిమర్ల నియోజకవర్గ యువజన నాయకులు బడ్డుకొండ ప్రదీప్ నాయుడు అన్నారు. సంక్షేమ పథకాలు నిరంతరా యంగా అందాలంటే జగనన్న వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావాలని అన్నారు. మండలంలోరాజపులోవలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్ట్ ప్రచారం జోరుగా సాగింది. వైస్సార్సీపీ మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, స్థానిక వైసీపీ నాయకులతో కలసి ప్రదీప్ నాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లోఫ్యాన్ గుర్తుకు ఓటువేసి జగనన్నను ముఖ్యమంత్రిను చేయాలనీ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేగా బడ్డుకొండ అప్పలనాయుడు, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్ గారిని భారీ మీజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ప్రతినిధి పడాల బానుప్రకాష్, వైస్ ఎంపీపీ ప్రతినిధి పడాల శ్రీనివాసరావు, మండల యూత్ అధ్యక్షులు సుందర హరీష్,కిలారి వెంకట రమణ, వాసుపల్లి రెయ్యిడు, పూడి నూకరాజు, రిక్క అప్పలనర్సయ్య గ్రామ వాలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ...

జోరుగా గ్రావెల్, ఇసుక అక్రమ రవాణా....



విశాలాంధ్ర-బొబ్బిలి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సంబంధిత రెవెన్యూ సిబ్బంది ఎన్నికల విధులకు పరిమితం కావడంతో మండల పట్టణ పరిధిలో పలు ప్రభుత్వ చెరువుల్లో గ్రావెల్ ఇసుక జోరుగా అక్రమ రవాణా జరుగుతుందని సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని పట్టణ మండల ప్రజలు సంబంధిత అధికారులను డిమాండ్ చేస్తున్నారు. స్థానిక రెవిన్యూ ఇన్స్పెక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో ఇసుక కంకర అక్రమ రవాణా పై పదిసార్లు సిబ్బందితో దాడులు నిర్వహించి వాహనాలను సీజ్ చేసిన గ్రావెల్ ఇసుక మాఫియా విచ్చలవిడిగా తరలించకపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు ఇసుక గ్రావిల్ త్రవ్వకాలు పై తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

23న సిద్ధం సభ

చిన్న శ్రీను ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర-విజయనగరం : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ నెల 23న జిల్లా కేంద్రానికి రానున్నారు.బస్సు యాత్రలో భాగంగా 23 సాయంత్రం 4 గంటలకు చెల్లూరు వద్ద జరిగే బహిరంగ సభలో జగన్మోహన్ రెడ్డి పాల్గొంటారు. ఈ సభకు సంబంధించి సభా స్థలం వద్ద ఏర్పాట్లు జిల్లా పరిషత్ చైర్మన్, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ డిప్యూటీ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ఆదివారం పరిశీలించారు.సిద్ధం సభకు భారీగా అభిమానులు కార్య కర్తలు హాజరుకానున్న నేపథ్యంలో తగిన ఏర్పాట్లను చేస్తున్నారు.

టీడీపీ కి ఓటు వేసి కళా ను గెలిపించండి

విశాలాంధ్ర-గరివిడి: పట్టణంలో (కొండపాలెంలో) ఈరోజు గరివిడి మండల, పట్టణ నాయకులుతో కలసి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు ఇంటి ఇంటి ప్రచారంలో పాల్గొన్నారు. చీపురుపల్లి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కిమిడి కళావెంకట రావు కి తమ అమూల్యమైన ఓటు సైకిల్ గుర్తు పై వేసి అత్యదిక మెజారిటీ తో గెలిపించవలిసినిదిగా కోరడమైనది. ఈ కార్యక్రమం లో జనసేన ఇంచార్జ్ విసినగిరి శ్రీనివాస రావు, జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు, మాజీ ఎంపీపీ పైల బాలరాం, మండల పార్టీ అధ్యక్షులు సారేపాక సురేష్ బాబు, బలగం వెంకట రావు, మహంతి రమణ మూర్తి, కోట్ల కృష్ణ(జనసేన), గరివిడి పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన కొత్తవలస టౌన్ పార్టీ కమిటీ ప్రకటన

విశాలాంధ్ర-కొత్తవలస: జనసేన శృంగవరపుకోట నియోజకవర్గ సమన్వయకర్త వబ్బిన సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం కొత్తవలస పార్టీ కార్యాలయంలో 23 సభ్యులతో కూడిన కొత్తవలస టౌన్ కమిటీ నియమించడం జరిగింది. గాలి అప్పారావు కొత్తవలస టౌన్ అధ్యక్షుడిగా ఉపాధ్యక్షులుగా అంతకాపల్లి లక్ష్మణరావు, ఎలిమిరెడ్డి లక్ష్మీకాంత్ నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శులుగా రాందాస్ కాశీ , బంధం సత్యనారాయణ నియమితులయ్యారు. 6 సభ్యులను కార్యదర్శులుగాను, 12 సభ్యులను సంయుక్త కార్యదర్శులుగాను గాను నియమించడం జరిగింది. నూతన కమిటీకి అభినందనలు తెలియజేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాల్సిందిగా నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ వబ్బిన సత్యనారాయణ కోరారు.

కోండ్రు మురళిమోహన్ కు బి.ఫాం ను అందజేసిన అధినేత చంద్రబాబు

విశాలాంధ్ర-రాజాం: మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఉండవల్లిలోని తన నివాసంలో బి. ఫాం ను మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ కు ఆదివారం నాడు బి.ఫాంను అందించారు.ముందుగా చంద్రబాబు,రాష్ట్ర అధ్యక్షులు,తదితర నాయకులతో కలిసి స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం చంద్రబాబు నాయుడు .అభ్యర్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యమంలో చంద్రబాబు కోండ్రు మురళీమోహన్‌కి అభినందనలు తెలియజేస్తూ. రాజాం నియోజకవర్గం లో అఖండ మయిన మెజారిటీ సాధించాలని ఆశీస్సులు అందజేసి తెలుగుదేశం పార్టీ గెలుపుకోసం కృషి చెయ్యాలని పిలుపునిచ్చారు. బి. ఫాం అందజేయడం పట్ల చంద్రబాబుకు కోండ్రు కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబు గెలుపు - పెన్షనర్ల పిలుపు కరపత్రం ఆవిష్కరణ

విశాలాంధ్ర - విజయనగరం అర్బన్ : ఎపి ఎన్జీవో రాష్ట్ర మాజీ అధ్యక్షులు జి. పూర్ణచంద్రరావు ఆదివారం విజయనగరం అశోక్ బంగ్లాలో తెలుగు దేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతి రాజు చేతులమీదుగా "ఆంధ్ర ప్రదేశ్ పునర్నిర్మాణము - పెన్షనర్ల సంక్షేమం, చంద్రబాబు గెలుపు - పెన్షనర్ల పిలుపు" కరపత్రాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా జి. పూర్ణచంద్రరావు మాట్లాడుతూ రాష్ట్ర పునర్నిర్మాణం కొరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, యువత, నిరుద్యోగులు, ప్రభుత్వ ప్రైవేట్ రంగంలో పనిచేసే కార్మికులు, రైతులు, మహిళలు, ఇతర అల్పాదాయ మధ్య తరగతి ప్రజానీకం శ్రేయస్సు దృష్ట్యా పారదర్శక పాలన అందించుట కొరకు నారా చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలోని తెలుగు దేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ నియోజక వర్గములలో బలపరచి భారీ మెజారిటీతో గెలిపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు ఎపి సచివాలయం సంఘం మాజీ అధ్యక్షులు పి.గురవయ్య, ఎపి ఎన్జీవోమాజీ కార్యదర్శి జి. విజ్ఞం చౌదరి, ఎపి ఎన్జీవో సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు ఆర్. రామమూర్తి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగన్మోహన్ రెడ్డి బస్సు యాత్రను విజయవంతం చేయాలి

ఈనెల 23న చెల్లూరు వద్ద జరిగే బస్సు యాత్రకు అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలి

విశాలాంధ్ర-చీపురుపల్లి: చీపురుపల్లి వైస్సార్ పార్టీ కార్యాలయంలో చీపురుపల్లి మండల వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇప్పిలి అనంతం, జిల్లా వైస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మాజీ జడ్పీటీసీ సభ్యులు మీసాల వరహాలనాయుడు, పత్రికా సమావేశం లో మాట్లాడుతూ ఈ నెల 23 వ తేది మంగళవారం మధ్యాహ్నం 3-00 గంటలకు విజయనగరం దగ్గర చెల్లూరు గ్రామం విజయనగరం నుండి వైజాగ్ హైవే ప్రక్కన మన ప్రియతమ నాయకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దిశ దశ మార్చిన యంగ్ డైనమిక్ లీడర్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు శ్రీ వై. యస్. జగన్మోహన్ రెడ్డి గారు బస్ యాత్రలో భాగంగా లిమేము అంత సిద్ధం సభకులి రానున్నారు, ఈ ఎన్నికలో వైస్సార్ పార్టీ అభ్యర్థులు తరుపున ప్రచారం చేయునున్నారు, వైస్సార్ పార్టీ అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు తో జరిగే భాహిరంగ సభలో పాల్గొంటారు కావున చీపురుపల్లి మండలం నియో జక వర్గంలో ఉన్న వైస్సార్ పార్టీ అభిమానులు, నాయకులు, వివిధ హొదాలో ఉన్న నాయకులు, మహిళాలు, కార్యకర్తలు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయవలసినది గా కోరుచున్నాము. ఈ కార్యక్రమం లో చీపురుపల్లి వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇప్పిలి అనంతం, జిల్లా వైస్సార్సీపీ కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మాజీ జడ్పీటీసీ సభ్యులు మీసాల వరహాలనాయుడు, కందుల కృష్ణ, ప్రభాత్ కుమార్, బొంతు తిరుపతి యాదవ్, రోబ్బి చిన్ని, చీపురుపల్లి వైస్సార్సిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహావీర్ జయంతి ర్యాలీ లో సిరి సహస్ర

విశాలాంధ్ర-విజయనగరం : మహావీర్ జయంతి సందర్భంగా విజయనగరం పట్టంలోని ఆకానపు వీధిలో శ్రీ జైన్ మందిరాన్ని సిరిసహస్ర సందర్శించారు. అక్కడ నుండి మహావీర్ జయంతి ర్యాలీ ఆమె పాల్గొన్నారు. కన్యకాపరమేశ్వరి కోవెల మీదుగా ఎన్.సి.ఎస్.దియేటర్ , బొడ్డువారి జంక్షన్ మీదుగా జైన్ మందిరం వరకు ర్యాలీ సాగింది . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహావీరుని భోదనలు భారత జాతికే ఆదర్శమని, వాటిని ఆచరించే బాధ్యత మనదేనన్నారు. ఈ కార్యక్రమంలో సోల్జర్స్ అధ్యక్షులు తోట వాసు, సోల్జర్స్ సభ్యులు శివ, హేమంత్, దక్షిణామూర్తి, భాస్కర్ , శివరామ క్రిష్ణ , రామకృష్ణ , సాయి, చిన్న , శంకర్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కళ్యాణ వేంకటేశ్వర ఆలయంలో మహా సామ్రాజ్య పట్టాభిషేకం



విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : పట్టణంలోని రింగ్ రోడ్ శ్రీ కళ్యాణ వేంకటేశ్వర ఆలయంలో మహా సామ్రాజ్య పట్టాభిషేకం మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అష్టోత్తర శత శ్రీమద్ వాల్మీకి రామాయణ పారాయణం జరిగింది.సాయంత్రం శ్రీ శ్రీనివాస సేవా సంఘం ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహించారు .అనంతరం సిలికాన్ ఆంధ్రా యూనివర్సిటీ కి చెందిన రాష్ట్రపతి అవార్డు గ్రహీత, విజయవాడకు చెందిన శ్రీమాన్ అద్దంకి శ్రీనివాస్ చే రామాయణంలోని పలు అంశాలపై ఆధ్యాత్మిక ప్రవచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

రాక్షస ప్రభుత్వాన్ని తరిమి కొట్టాలి

టీడీపీ రాష్ట్ర కార్యదర్శికిమిడి రామ్ మల్లిక్ నాయుడు

విశాలాంధ్ర-చీపురుపల్లి: రాష్ట్రంలో కొనసాగు తున్న రాక్షస పాలనకు స్వస్థపరగాలంటే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని తరిమి తరిమికొట్టాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు అన్నారు. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా చీపురుపల్లి పట్టణంలో కొత్తగవిడివీధి ఆంజనేయ పురం. కుమ్మర కాలనీ లలో ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి రాను నేను ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి అఖండ మెజారిటీ చేకూర్చాలని ఆయన కోరారు. రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందని ఆయన అన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధిని గాలికి వదిలిందని ఆయన అన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం హత్య రాజకీయాలకు మద్దతు తెలుపుతుందని ఆయన అన్నారు. ఈ ప్రభుత్వంలో ప్రభుత్వ వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయని ఆయన అన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పట్ల ప్రజలు విశ్వాసాన్ని కోల్పోయారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని బంగాళాఖాతంలో కలిపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే కి ఒక ఓటు ఎంపీ కి వేరొక ఓటు రెండు ఓట్లను సైకిల్ గుర్తుపై వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన మరోసారి కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రౌతు కాము నాయుడు రౌతు నారాయణరావు. దన్నాన రామచంద్రుడు. ఇజ్జి రోతు రాంబాబు జనసేన చీపురుపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ విసినిగిరి శ్రీనివాసరావు. ఆరతి సాహూ, సబ్బిసోనియా గవిడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడు ప్రజాగళం బహిరంగ సభను విజయవంతం చేయండి

కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి లలితకుమారి పిలుపు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజాగళంలో భాగంగా శృంగవరపుకోట నియోజకవర్గ కేంద్రానికి సోమవారం సాయంత్రం 6 గంటలకు విచ్చేయుచున్నారని, ఈ బహిరంగ సభలో మహిళలు, యువకులు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎస్.కోట నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి పిలుపునిచ్చారు.

ఎన్నికల నిబంధన ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర-చీపురుపల్లి: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన ఇటువంటి తగాయిదాలకు ముందుకు వచ్చిన కఠిన చర్యలు తీసుకుంటామని చీపురుపల్లి ఎస్సై కెకెకె నాయుడు తెలిపారు ఆదివారం సాయంత్రం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సుమారు 40 మంది ఆర్ పి ఎస్ ఎఫ్ సిబ్బందితో కలిసి మండలంలోని ఇటకర్లపల్లి పేరిపి గొల్లల ములగాం గొల్లలపాలెం గ్రామాలలోఫ్లాగ్ మార్చ్ నిర్వహించామన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఓటర్లు ప్రశాంతంగా ఓటింగ్లో పాల్గొనాలని ఎదుటివారి హక్కుకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించరాదని ఎదుటి వ్యక్తులను దూషించడం దుర్భాషలాడటం కించపరిచి మాట్లాడటం నేరమని ఓటు హక్కును స్వేచ్ఛ వాతావరణంలో వినియోగించే విధంగా అందరూ సహకరించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి ఎస్ఐ తో పాటు సివిల్ సిబ్బంది ఆర్ పి ఎస్ ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

విజయనగరం జిల్లా టీడీపీ అభ్యర్థులకు బీ ఫారాలు

విశాలాంధ్ర-వంగర : విజయనగరం జిల్లా లో పలు నియోజక వర్గాల్లో టీడీపీ నుండి పోటీ చేస్తున్న అభ్యర్థులకు తెలుగు దేశం జాతీయ అధ్యక్షులుమాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీ ఫారాలుఅందజేశారు. ఆదివారం వుండ్రవెల్లిలో అందజేశారు. విజయనగరం జిల్లాకు సంబంధించి, విజయనగరం నియోజక వర్గ తెలుగు దేశం ఎమ్మెల్యే అభ్యర్థి పూస పాటి అతిథి గజపతి రాజుకు, చీపురుపల్లి నియోజక వర్గ దేశం అభ్యర్థి మాజీ మంత్రి కిమిడి కళా వెంకట రావుకు,రాజాం నియోజక వర్గ టీడీపీ అభ్యర్థి మాజీ మంత్రికోండ్రు మురళీ మోహన్ కు,బొబ్బిలి నియోజక వర్గ తెలుగు దేశం అభ్యర్థి బేబీనాయనకు,గజపతినగరం టీడీపీ అభ్యర్థి కొండపల్లి శ్రీనివాసకు, విజయనగరం పార్లమెంట్ టీడీపీ ఎంపీ అభ్యర్థి కలిశెట్టిఅప్పల నాయుడు కు బాబు తెలుగు దేశం బీ- ఫారాలు అందజేశారు.

ఇంటింటి ప్రచారంలో కిమిడి రామ్ మల్లిక్ నాయుడు



విశాలాంధ్ర-చీపురుపల్లి: నియోజక వర్గం ఆదివారం గరివిడి మండల, పట్టణ నాయకులుతో కలసి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు ఇంటి ఇంటి ప్రచారంలో పాల్గొని చీపురుపల్లి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కిమిడి కళావెంకట రావు కి తమ అమూల్యమైన ఓటు సైకిల్ పై వేసి అత్యదిక మెజారిటీ తో గెలిపించాలని కోరారు. బిజనసేన ఇంచార్జ్ విసనగిరి శ్రీనివాస రావు, జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు, మాజీ ఎంపీపీ పైల బాలరాం, మండల పార్టీ అధ్యక్షులు సారేపాక సురేష్ బాబు, బలగం వెంకట రావు, మహంతి రమణ మూర్తి, కోట్ల కృష్ణ(జనసేన), గరివిడి పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుందరం మందిరం లో ఉచిత నేత్ర శిభిరాని కి అనూహ్య స్పందన

విశాలాంధ్ర-రాజాం: విజయనగరం జిల్లా రాజాం మున్సిపాలిటీ పరిధి స్థానిక అమ్మవారి కాలనీ మెంటిపేట లో గల శ్రీ సత్యసాయి సేవాసమితి సుందరం మందిరంలో ఆదివారం ఉచితనేత్ర వైద్యశిబిరం జరిగింది. ఈ కార్యక్రమం లో 81మంది హాజరయ్యారు వారిలో 36మంది ఆపరేషన్ కి సెలెక్ట్ అయ్యారు. ఈ శిభిరం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి విశాఖపట్నం వారి చే ఏర్పాటు చేసినట్లు సుందరం మందిరం కన్వీనర్ ముప్పిడి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆప్తాలామిక్ ఆఫీసర్ ఆర్. సురేష్, క్యాంపు కోఆర్డినేటర్ ఎం. సాయి కుమార్ మరియు సిబ్బంది తనిఖీ లు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం లో సేవాదళ్ సభ్యులు అద్దంకి సూర్యారావు, అద్దంకి శ్రీనివాస రావు, కె. కృష్ణమూర్తి మాస్టర్, ఎం. తిరుపతి రావు, అరసవిల్లి రాము, మానం రమేష్, వాండ్రంగి తిరుమల రావు, జమ్ము సత్యం, ఎలిశెట్టి గోపి, ఎం.బాబ్జి మాస్టర్, నీలం నాయుడు మాస్టర్,ఎస్. తవిటి రాజు,సత్యన్నారాయణ మాస్టర్,కృష్ణ కుమారి, ద్రాక్షయని, రోజా, సూర్యనారాయణమ్మ, పొన్నాడ భవాని, పడాల సులోచన, అద్దంకి జయలక్ష్మి, ఎన్. శారదా పాల్గొని వారి సేవలు అందించినట్లు ముప్పిడి శ్రీనివాస రావు తెలిపారు. కార్యక్రమంలో రాజాం జోనల్ ఇంచార్జ్ రామకృష్ణ, పెంకి చైతన్య పాల్గొన్నారు.

శ్రీ గాయత్రీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం, కంటోన్మెంట్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : శ్రీ గాయత్రీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం, ఉడా కోలనీ, ఫేస్ 3, కంటోన్మెంట్ ఆధ్వర్యంలో మండుతున్న ఎండలు దృష్టిలో పెట్టుకుని పాదచారులకు, వ్యాపారస్తులకు, ప్రయాణీ కులకు వృద్ధులకు పాల్ నగర్ ముత్యాలమ్మ ఆలయం వద్ద ఉచిత మజ్జిగ పంపిణీ దాతలు కాత్యాయనీ,వినీల సహకారం తో కార్యక్రమం జరిగింది.అలాగే పంపిణీ కార్యక్రమం కి కావలిసిన సామాన్లు పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి శ్రీ ధనలక్ష్మి జ్యువలర్స్ అధినేత శ్రీరామ్ అందచేయడం జరిగింది.ఈ సందర్భంగా అధ్యక్షులు శ్రీ పప్పు విశ్వనాథ్ మాట్లాడుతూ వేసవిలో దాహార్తులుకు చల్లటి మజ్జిగ ప్రతి సంవత్సరము అందజేస్తున్నా మన్నారు ఈ సంవత్సరం కూడా ఎప్పుడు వలె మరెన్నో సేవా కార్యక్రమాలు చేసేందుకు కార్యవర్గం సిద్ధంగా ఉందన్నారు న్నారు. ఎండలు తీవ్రత బట్టి మే నెలాఖరు లేదా అపై కూడా మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అందరూ ఈ అవకాశం వినియోగించు కోవాలి అని కోరారు కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఏవి రామకృష్ణ,ఉపాధ్యక్షులు గంటి గిరిజ,కార్యవర్గ సభ్యులు మండా నాగమణి,నరెడ్ల సునీత, అనురాధ,శైలజ, శ్యాంసుందర్ ,కోశాధికారి కె.విజయరామ క్రిష్ణ, ఇతర సభ్యులుతదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తుకు చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలి

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప క్రిష్ణ

విశాలాంధ్ర -శృంగ వరపుకోట : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తు, దిక్సూచి కోసం టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుని ముఖ్య మంత్రిగా చేసుకో వాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప క్రిష్ణ అన్నారు. ఎస్.కోటలోని కూటమి విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గొంప క్రిష్ణ మాట్లాడుతూ ఒక్క అవకాశం పేరిట వైఎస్ జగన్మోహన్ రెడ్డి అలవికాని హామీలిచ్చి పోలవరం నిర్మాణం, సీపీఎస్ రద్దు, ప్రతి సంవత్సరం జాబ్ కార్డ్, అమరావతి నిర్మాణం వంటివి పక్కన పెట్టేశారని, అలాగే ఇసుక, మద్యం, మైనింగ్ వాటిల్లో అక్రమ సంపాదన చేస్తూ కొత్త మోసాలు, అబద్దాలతో మళ్లీ ఐదేళ్ల ఏలుదామని ప్రజల ముందుకు వస్తున్నారని గొంప విమర్శించారు. కానీ ప్రజలు తెలివైన వారు ఒక్క అవకాశం జగన్మోహన్ రెడ్డికి ఇచ్చారని గుర్తు చేశారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా, అనుభవం ఉన్న వ్యక్తి అయిన చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అలాగే కొద్ది నెలల క్రిందట సెమీఫైనల్ వంటి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మా మద్దతుతో అభ్యర్థులు గెలిచారని, కడప, కర్నూలు వంటి జిల్లాల్లో కూడా టీడీపీ అభ్యర్థులు మంచి మెజార్టీతో విజయం సాధించారని స్పష్టం చేశారు. ఇప్పుడు కూడా అనుభవం కలిగిన, సంపద సృష్టించి ప్రజల జీవితాలను మార్పు చేయకలిగే సత్తా ఉన్న చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలు కంకణం కట్టుకున్నారని గొంప క్రిష్ణ వెల్లడించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్ మాట్లాడుతూ నాకు టీడీపీ రాష్ట్ర స్థాయి పదవిని ఇచ్చిన జాతీయ అధినేత చంద్రబాబు నాయుడు, ప్రధాన కార్యదర్శి లోకేష్, ఎంపీ అభ్యర్థి శ్రీభరత్, ఇతర పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇక నేడు ఎస్.కోటలో జరుగనున్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు రోడ్ షోను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఇందుకూరి సుధారాణి, మండల పార్టీ అధ్యక్షుడు జీవన్ నాయుడు పాల్గొన్నారు.

నేటి సాయంత్రం 5గంటలకు చంద్రబాబు రోడ్ షో..

ఎస్.కోట జూనియర్ కళాశాల మైదానం ఎదురుగా నారా చంద్రబాబు నాయుడు రోడ్ షో సోమవారం సాయంత్రం 5గంటలకు జరుగుతుందని, ఈ కార్యక్రమానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, రైతులు, మహిళలు, ప్రజలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని గొంప క్రిష్ణ పిలుపునిచ్చారు. రోడ్డు షో అనంతరం టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎస్.కోటలోని శిరికి రిసార్ట్స్ లో రాత్రి బస చేస్తారని, మంగళవారం ఉదయం 10గంటలకు బయలుదేరి గజపతినగరంలో నిర్వహించనున్న మహిళా సదస్సుకు హాజరవుతారని గొంప క్రిష్ణ వివరించారు.

నన్ను అభాసు పాల్చేయకండి... సవ్యంగా సద్వినియోగం చేస్తే బ్రహ్మాస్త్రాన్నవుతా!

ఆ ఒక్క రోజు అన్ని పనులుపక్కన పెట్టి వచ్చి ఓటేయండి. అది మీ బాధ్యతని గుర్తెరగండి...

విశాలాంధ్ర-భోగాపురం : ఉన్నాను, నేనున్నాను, మీకోసమే చూస్తున్నాను. మీ బుర్ర ఎంతో పదునో, మీకు విజ్ఞత ఎంత ఉందో, మీ సామాజిక స్పృహ ఏపాటిదో, మీ పరిజ్ఞానం ఏ మేరకో నేను చూస్తాను. అసలు దొంగలు ఎవరెవరో, అన్నీ చూడడానికి నేను తహతహలాడుతున్నాను. నన్ను ఎలా వాడుకుంటారో? నన్ను ఎంతకి అమ్ముకుంటారో? లేక అమ్ముకోకుండా ఆత్మభిమానంతో ఉంటారో నేను చూస్తాను. అంతా మీ ఇష్టం. నేనెవరో తెలుసా? మీ ఆయుధాన్ని, మీ ప్రశ్నించే తత్వాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థలో నేనెంతో కీలకం, అన్నిటికి మించి ప్రజాస్వామ్య పరిరక్షకురాలిని, మీ అందరి చేతిలో ఉన్న బ్రహ్మాస్త్రాన్ని "అదే నేనూ...మీ ఓటును... సవ్య దిశలో నన్ను ప్రయోగిస్తే 5 సంవత్సరాలు మీ ఆకాంక్షలు నెరవేరుస్తాను. అపసవ్య దిశలో ప్రయోగించారో మిమ్మల్ని అధః పాతాళానికి తొక్కేస్తాను. నన్ను అభాసు పాల్చేయకండి. సవ్యంగా సద్వినియోగం చేయండి. మీ సరైన నిర్ణయమే నాకు రక్ష, అదే సమాజానికి శ్రీ రామ రక్ష. అలాగే మే 13న జరిగే పోలింగ్ రోజున మిమ్మల్ని అందరిని కలవబోతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఆరోజున మంచి మనసుతో రేపటి ఉజ్వల భవిషత్ తీర్చిదిద్దే నిజాయితీపరులను ఎన్నికొనేందుకు తరలిరండి. ఆరోజు వీలు చూసుకుని అందరూ రావాలి. వంకలు పెట్టి ఇంటిపట్టును ఉండకండి. ఆ ఒక్క రోజు అన్ని పనులు ప్రక్కన పెట్టి వచ్చి ఓటేయండి. అది మీ బాధ్యతని గుర్తుంచుకోండి.

జూట్ కార్మికుడికి దాతలు ఆర్థిక సహాయం అందించి ఆదుకోండి

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణం శ్రీ లక్ష్మీ శ్రీనివాస జూట్ మిల్లులో కార్మికుడిగా పనిచేసిన ఓ మాజీ జూట్ కార్మికుని వ్యధార్థ గాధ..ఆయన వ్యధ గుండెలనుపిండి చేస్తుంది.ఈయన పేరు పిరిడి రాంబాబు వయసు 53 సంవత్సరాలు. బొబ్బిలి తారకరామ కాలనీ లో అద్దె ఇంట్లో అత్యంత దయనీయమైన స్థితిలో జీవనం సాగిస్తున్నాడు.14 సంవత్సరాల పాటు స్థానిక జూట్ మిల్లులో డ్రాయింగ్ డిపార్ట్మెంట్ లో పనిచేసేవాడు.2014 లో జూట్ మిల్లు మూసేయడంతో రాంబాబు బ్రతుకు దుర్భరంగా మారింది.సుమారు రెండేళ్ల నుంచి పక్షవాతం బారినపడి మంచానికే పరిమితం కావడంతో వైద్యం చేయించుకునే స్థోమత లేక, మందులు కొనుక్కోలేని దుస్థితి లో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు.కాళ్ళు, చేతులు ఆయన స్వాధీనంలో లేకపోవడంతో ఇంట్లో ని మహిళలే అష్టకష్టాలు పడి రాంబాబుకు సపర్యలు చేస్తున్నారు.ఆయనకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు, వృద్ధురాలైన ఒక అత్త ఉన్నారు.ఆడ పిల్లలకు పెళ్లిళ్లు అయ్యాయి.జూట్ యాజమాన్యం 18 నెలల ప్రావిడెంట్ ఫండ్ డబ్బులు చెల్లించక పోవడంతో రాంబాబు కు రావలసిన నెలవారీ 1500 రూపాయలు పెన్షన్ రావడం లేదు. కుటుంబాన్ని పోషించడం కోసం భార్య మాధవి నెలకు రూ.5 వేలకు చిన్న పాటి ఉద్యోగం చేస్తోంది. సొంత ఇల్లు లేక అద్దె చెల్లించుకోలేక, వైద్యం చేయించుకోలేక లేవడానికి కాళ్ళు, చేతులు సహకరించక పోవడం తో రాంబాబు హృదయ విదారకంగా రోదిస్తున్నాడు.చూసిన వారి గుండె తరుక్కుపోతోంది. మంచి మనసు ఉన్నవారు, మానవత్వంతో తనను ఆదుకుంటే వైద్యం చేయించుకుంటానని.నా పని నేను చేసుకునేందుకు శక్తిని కూడ దీనుకునేందుకు ఆశీర్వాదములు అందించాలని అర్థిస్తున్నాడు. ఆర్థిక సహాయం అందించే దాతలు పిరిడి రాంబాబు కుమార్తె పి . వాసంతి ఫోన్ పే నెంబర్ 9110749401, తారక రామ కాలనీ, బొబ్బిలి, విజయనగరం జిల్లా..... దయార్ద్ర హృదయులు దయతో ఆపన్న హస్తం అందించాలని కోరారు.